TGTEL/26/A5513


వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 66 | 04 బుధవారం నవంబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

పట్టభద్రులకు ఊరట:

తెలంగాణలో ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పొడిగింపు

ఆన్‌లైన్ పోర్టల్‌లో సాంకేతిక సమస్యలతో ఈసీ నిర్ణయం



నామినేషన్ల చివరి తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశంనవంబర్ 25న ముసాయిదా, డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువును ఎన్నికల సంఘం పొడిగించింది. ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల అర్హులైన పట్టభద్రులు నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు తమ ఓటును నమోదు చేసుకునే అవకాశం లభించింది.


ఏఐ భూతం కాదు.. మానవాళికి ఊతం..

హబ్ ఏఐ ప్రొడక్ట్' లాంచ్ కార్యక్రమంలో కేటీఆర్

- అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ శాఖల్లోకి ఏఐ
- గ్రామీణ ప్రాంతాల్లోనూ ఐటీ కంపెనీలకు అవకాశం
- తెలంగాణ యువత ఉద్యోగాల కోసం చూడటం
- కాకుండా.. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి
- నానక్‌రామ్‌గూడలోని షెరటాన్ హోటల్‌లో 'క్యాంపస్
- హబ్ ఏఐ ప్రొడక్ట్' లాంచ్ కార్యక్రమంలో కేటీఆర్

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను భూతంగా చూడొద్దని, మానవాళికి ఉపయోగపడే ఊతంగా, సాధనంగా వినియోగించుకోవాలని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వంలోని అన్ని శాఖలు, వ్యవస్థలతో ఏఐని అనుసంధానం చేస్తామని తెలిపారు. నానక్‌రామ్‌గూడలోని షెరటాన్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన క్యాంపస్ హబ్ ఏఐ ఉత్పత్తి ఆవిష్కరణ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు.గ్రామీణ ప్రాంతాలకు చెందిన నలుగురు యువకులు కలిసి క్యాంపస్ హబ్ ఏఐని రూపొందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ నలుగురు యువకులు సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఉద్యోగాలు వెతుకునేవారిగా కాకుండా, ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలనే వారి ఆలోచన ఆదర్శనీయమని అభినందించారు. యువత పెద్ద కలలు కనాలని, కొత్త ఆలోచనలతో ముందుకురావాలని సూచించారు. వైఫల్యాలను అనుభవాలుగా తీసుకొని, వాటి నుంచి పాఠాలు నేర్చుకుంటూ లక్ష్యాలను సాధించాలని సూచించారు.

...మిగతా 2 లో...





ఫారెస్ట్ సరిహద్దు వివాదాలకు జాయింట్ సర్వే: పొంగులేటి

రెవెన్యూ, అటవీ శాఖ భూముల సరిహద్దు వివాదాలకు శాశ్వత పరిషారం చూపాల్సిన అవసరం ఉన్నదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జాయింట్ సర్వేతోనే ఈ సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. సోమవారం సచివాలయంలో రెవెన్యూ, ఫారెస్ట్ విభాగాలు, సర్వే, సెటిల్‌మెంట్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సరిహద్దు వివాదాల వల్ల సామాన్యుల సంయుక్తంగా క్షేత్రస్థాయిలో సర్వేలు చేపట్టాలని, ఈ సర్వేలను ఆధునిక పరిజ్ఞానం, శాస్త్రీయ పద్ధతుల సహాయంతో నిర్వహించి భూములకు స్పష్టమైన సరిహద్దులను గుర్తించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి, రికార్డులు, మ్యాపులు, సర్వే వివరాలను సమగ్రంగా సరిపోల్చి వివాదాలకు తావులేకుండా స్పష్టమైన హద్దులను నిర్ధారించాలని సూచించారు.

డెమోక్రాట్లు గెలిస్తే 'మిస్టర్ వీటో'గా మారిపోతా..

ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

- డెమోక్రాట్లు గెలిస్తే అన్ని నిర్ణయాలను వీటో చేస్తానన్న ట్రంప్
- మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేయాలని ఉందని వ్యాఖ్య
- రాజ్యాంగం ప్రకారం మూడోసారి ఎన్నిక కావడం సాధ్యం కాదని అంగీకారం
- తన సిబ్బందిపై విచారణలు జరిగితే ముందస్తు క్షమాభిక్షలు ఇస్తానని వెల్లడి
- డెమోక్రాట్లకు అనుకూలంగా ఉన్నాయంటూ సర్వేలను తప్పుబట్టిన ట్రంప్ద



అమెరికా మధ్యంతర ఎన్నికల వేళ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో డెమోక్రాట్లు మెజారిటీ సాధిస్తే వారి ప్రతిపాదనలన్నింటినీ వీటో చేస్తానని హెచ్చరించారు. మరోసారి అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని ఉందని, అయితే రాజ్యాంగ నిబంధనలు అందుకు అడ్డుగా ఉన్నాయని పేర్కొన్నారు.న్యూయార్క్ పోస్ట్ కాలమిస్ట్ మిరాండా డివైన్‌తో 'పాడ్ ఫోర్స్ వన్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన సందర్భంగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో తమ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఓటమి ఎదురైతే.. 'మిస్టర్ వీటో'గా మారతానని అన్నారు. నెల లేదా రెండు నెలల పాటు వరుసగా వీటోలు వేస్తే డెమోక్రాట్లు చర్చలకు వచ్చి ఒప్పందానికి అంగీకరిస్తారని వ్యాఖ్యానించారు.మూడోసారి పోటీపై ఆసక్తి మరోసారి అధ్యక్షుడిగా పోటీ చేసే అవకాశం వస్తే తప్పకుండా బరిలో ఉండాలని ఉందని ట్రంప్ చెప్పారు. అయితే రాజ్యాంగంలోని నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని అంగీకరించారు. అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ ప్రకారం ఒక వ్యక్తి రెండుసార్లకు మించి అధ్యక్షుడిగా ఎన్నికవడానికి వీల్లేదు. ట్రంప్ 2016, 2024 ఎన్నికల్లో విజయం సాధించారు.



మునుగోడుకు ఇదేం శాపం.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి!

అధికార పార్టీ ఎమ్మెల్యే అయినప్పటికీ మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం.. ప్రతిపక్ష ఎఎవ్యక్తంచేశారు. సోమవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ నినో ప్రభావం, పంటల నష్టాలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడుకు పవర్‌ఫుల్ లీడర్‌గా ఉండటమే ఇక్కడి ప్రజలకు శాపంగా మారిందని వ్యాఖ్యానించారు.

...మిగతా 2 లో...

రేస్ కోర్స్ స్థలాన్ని ఐఏఎఫ్‌కే ఇవ్వండి..

రాజ్‌నాథ్‌కు లేఖ రాసిన ఏపీ సింగ్



న్యూఢిల్లీ: ఢిల్లీలోని రేస్ కోర్సు ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ భూమి పై వివాదం నెలకొన్నది. ఆ భూమిని ఐఏఎఫ్ ఆధీనంలోనే ఉంచాలని మాజీ ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్.. తన రిటైర్మెంట్‌కు కొన్ని రోజుల ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాసినట్లు తెలుస్తోంది. అక్టోబర్ 26వ తేదీన ఆయన ఆ లేఖ రాశారు. 40 ఎకరాల స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలాన్ని వైమానిక దళం ఆధీనంలోనే ఉంచాలని ఏపీ సింగ్ రక్షణ మంత్రిని కోరారు. అక్టోబర్ 29వ తేదీన రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన వ్యక్తిగత మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని చర్చించినట్లు తెలుస్తోంది. ఐఏఎఫ్ స్టేషన్‌లో ఉన్న స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ సీల్ చేయడంతో ఈ వివాదంపై రక్షణమంత్రికి ఏపీ సింగ్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. గృహ నిర్మాణ శాఖ ఆ స్థలాన్ని సీజ్ చేయడం వల్ల రక్షణ రంగంలో ఆందోళన మొదలైంది. సీజ్ చేసిన స్థలంలో గోల్ఫ్ కోర్స్, స్విమ్మింగ్ పూల్, ఇతర ఎమినిటీస్ ఉన్నాయి.

...మిగతా 2 లో...

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..

అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

- అమెరికాలో కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభం
- ప్రతినిధుల సభలోని 435, సెనెట్‌లోని 35 స్థానాలకు ఓటింగ్
- అధ్యక్షుడు ట్రంప్ రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఎన్నికలు
- గెలిస్తే ట్రంప్ నిర్ణయాలను అడ్డుకుంటామంటున్న డెమోక్రాట్లు
- భారత కాలమానం ప్రకారం బుధవారం ఉదయం నుంచి ఫలితాల వెల్లడి



అమెరికా రాజకీయ భవిష్యత్తును నిర్దేశించనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (రిపబ్లికన్ పార్టీ) రెండేళ్ల పాలనకు ప్రజా తీర్పుగా భావిస్తున్న ఈ ఎన్నికల ప్రక్రియ మంగళవారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) మొదలైంది.

...మిగతా 2 లో...

'దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'.. అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!

- అమిత్ షా పర్యటనపై మంత్రి అడ్లూరి విమర్శలు
- తప్పులుంటే బయటపెట్టాలని కేంద్రానికి సవాల్
- దమ్కీలకు భయపడబోమని వ్యాఖ్య
- ఎస్ఐఆర్‌తో ఓట్ల తొలగింపునకు ది బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపణ

కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పులు చేస్తే ాల్ విసిరారు. జనాలను పోగేసి దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పేరు చెబితే బీజేపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు.

...మిగతా 2 లో...



నిరసన ప్రదేశాన్ని ఆక్రమించుకోవడం సరికాదు

న్యూఢిల్లీ: నిరసన పేరుతో ఓ ప్రదేశాన్ని ఎవరు కూడా నిరవధికంగా ఆక్రమించుకోలేరని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఆయా ప్రదేశాల్లో జరుగుతున్న ఆందోళనలకు నిర్దేశిత టైం పీరియడ్ ఉండాలని కోర్టు అభిప్రాయపడింది. సీఏఏకి వ్యతిరేకంగా గత నెలలో సెంట్రల్ ఢిల్లీలో విపక్షాలు భారీ ఎత్తు నిరసన ప్రదర్శన చేపట్టిన విషయం తెలిసిందేతుషార్ మెహతా స్పందిస్తూ.. నిరసన ప్రదర్శనకు ఎవరు పిలుపు ఇచ్చినా, దాని పర్యవసానాలను వాళ్లే ఎదుర్కోవాలని సుప్రీంకోర్టు తుషార్ మెహతా తెలిపారు. ఓ సైట్‌ను ఎప్పటికీ ఆక్రమించలేరని, నిరసన చేపట్టేందుకు ఇతరులు కూడా ఉన్నారని, రైతుల.. లాయర్లు ఎక్కడికి వెళ్తారని, ప్రతి ఒక్కరికీ నిరసన చేపట్టే హక్కు ఉందని సీజేఐ సూర్యకాంత్ అన్నారు.

TGTEL/26/A5513
వార్త దీపిక

ఏఐ భూతం కాదు.. మానవాళికి ఊతం..

మొదటిపేజీ తరువాయి

గతంలో తెలంగాణలో ఐటీ రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చామని, ఇప్పుడు ప్రపంచమంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగం నడుస్తున్నదని చెప్పారు. ప్రపంచం ప్రస్తుతం ఏఐ యుగంలోకి అడుగుపెడుతున్నదని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మనమూ మారాలని సూచించారు. ఏఐని కేవలం సాంకేతిక అభివృద్ధిగా కాకుండా ప్రజల సమస్యలకు పరిషారం చూపే సాధనంగా ఉపయోగించాలని కోరారు. అవసరమైన చోటే ఏఐని వినియోగించాలని, దుర్వినియోగం చేయకూడదని పేరొన్నారు. కొత్త విషయాలను నేర్చుకోవడంతోపాటు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం, రీ-సిల్లింగ్, అప్-సిల్లింగ్ అవసరమని చెప్పారు.వ్యవసాయంలో ఏఐతో ప్రయోగాలుబీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏఐ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చామని కేటీఆర్ గుర్తుచేశారు. 2020ని 'ఇయర్ ఆఫ్ ఏఐ'గా ప్రకటించి, వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగంపై దృష్టి సారించామని తెలిపారు. సిరిసిల్ల ప్రాంతంలోని వీర్నపల్లిలో 'ఏఐ ఫర్ అగ్రికల్చర్ ఇన్నోవేషన్', 'సాగు బాగు' కార్యక్రమాల ద్వారా రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువచేసే ప్రయత్నం చేశామని చెప్పారు. పంట ఆకుల ఫొటోను మొబైల్ ద్వారా పంపితే తెగుళ్లు, వాటి నివారణకు సంబంధించిన సూచనలు అందించే విధానాన్ని ఉదాహరణగా వివరించారు.విద్యావ్యవస్థలో ఏఐ కీలక పాత్ర పోషించనున్నదని చెప్పారు. ప్రతి విద్యార్థి నేర్చుకునే సామర్థ్యం, అవసరాలు వేర్వేరుగా ఉంటాయని, వాటికి అనుగుణంగా వ్యక్తిగత బోధన అందించేందుకు ఏఐ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పాఠశాలల నిర్వహణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలకు సాంకేతిక పరిషారాలు చూపే ఉత్పత్తుల ఆవిషరణను స్వాగతించారు. క్యాంపస్ హబ్ ఏఐతోపాటు ఇతర ఉత్పత్తులు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.హైదరాబాద్‌కే ఐటీ పరిమితం కావొద్దుఐటీ పరిశ్రమల ఏర్పాటు హైదరాబాద్‌కే పరిమితం కాకూడదని కేటీఆర్ చెప్పారు. వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లోనూ ఐటీ సంస్థలు విస్తరించాలని ఆకాంక్షించారు. పరకాలలో డీజీ యోధా సంస్థను స్థాపించి స్థానికంగా సుమారు 267 మందికి ఉపాధి కల్పిస్తున్న రాకేశ్‌ను అభినందించారు. బెల్లంపల్లి, కరీంనగర్ ప్రాంతాల్లో యువత ఐటీ సంస్థలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు కల్పిస్తున్న ఉదాహరణలను ప్రస్తావించారు. పట్టుదల, సరైన ప్రణాళిక ఉంటే చిన్న పట్టణాల్లోనూ ఐటీ పరిశ్రమలు అభివృద్ధి చేయవచ్చని చెప్పారు.అన్నిప్రభుత్వ శాఖల్లో ఏఐ వినియోగంరెండేండ్ల తర్వాత కచ్చితంగా బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, తాము వచ్చాక అన్ని ప్రభుత్వ శాఖలకు ఏఐని అనుసంధానం చేస్తామని కేటీఆర్ చెప్పారు. వ్యవసాయం, వైద్యం, విద్య సహా అన్ని రంగాల్లో వినియోగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. తెలంగాణ వ్యాప్తంగా ఐటీ రంగాన్ని విస్తరించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఏఐ మన ఆలోచన, పని, విద్య, జీవన విధానాల్లో మార్పులు తీసుకొస్తుందని చెప్పారు. ఇప్పటికే డ్రైవర్ లెస్ వాహనాలు అందుబాటులోకి వస్తున్నాయని పేర్కొన్నారు. ల్యాండ్‌లైన్ ఫోన్ల నుంచి స్మార్ట్‌ఫోన్ల వరకు టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిందని, రాబోయే కాలమంతా ఏఐదే కీలక పాత్ర అని చెప్పారు.

మంత్రి పదవి ఇవ్వలేదు.. నిధులూ రావడం లేదు..
రేవంత్ ప్రభుత్వంపై కోమటిరెడ్డి ఆగ్రహం

గట్టుప్పల్ మండలంలో పర్యటించిన సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మంత్రి పదవిపై మాట్లాడారు. పదవి ఇస్తామని చెప్పి మోసం చేశారని, అయినప్పటికీ మనసు చంపుకొని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిని కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. తనకు మంత్రి పదవి ఇస్తే ఎక్కడికో వెళ్లిపోతాననే ఉద్దేశంతోనే ఇవ్వడం లేదని వ్యాఖ్యానించారు.నియోజకవర్గ అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నిధుల కోసం ప్రతిపక్ష ఎమ్మెల్యేలాగా పోరాడాల్సి వస్తోందన్నారు. రోడ్ల నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని, దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుత పనులకే నిధులు ఇవ్వకపోతే కొత్త పనులు ఎలా చేపడతారని ప్రశ్నించారు. జీతాలు, రైతు భరోసా వంటి పథకాలకు నిధుల కేటాయింపులోనూ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని వ్యాఖ్యానించారు.మునుగోడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి జరగకపోతే పదవులను పట్టుకుని వేలాడబోనని, అవసరమైతే ఎమ్మెల్యే పదవిని వదులుకోవడానికి కూడా సిద్ధమని స్పష్టం చేశారు. గతంలో తాను కష్టపడి గెలిపించిన పలువురు నేతలు తనను మోసం చేశారని ఆరోపించారు. ఎవరికీ భయపడేది లేదని, రాజీపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.రాజగోపాల్‌రెడ్డి తాజా వ్యాఖ్యలతో సీఎం రేవంత్‌రెడ్డితో ఆయనకు విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి. గతంలోనూ ఇద్దరి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి పాల్గొన్న సభకు రాజగోపాల్‌రెడ్డి హాజరుకావడంతో పరిస్థితులు సద్దుమణిగాయని కాంగ్రెస్ వర్గాలు భావించాయి. అయితే రేడియల్ రోడ్ల టెండర్ల వ్యవహారం మళ్లీ వివాదానికి కారణమైంది. తన కుటుంబానికి చెందిన కంపెనీని ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆరోపిస్తూ ఆయన న్యాయపోరాటం చేస్తున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకా? లేక సీఎం రేవంత్‌రెడ్డితో మరోసారి నేరుగా తలపడేందుకు సంకేతమా? అన్న చర్చ మొదలైంది. ఇటీవల నిధుల విషయంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో, రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై పార్టీ నాయకత్వం ఎలా వ్యవహరిస్తుందో చూడాలి.

హైదరాబాద్‌లో అమిత్ షాను
కలిసిన చిరంజీవి, రామ్ చరణ్

కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో చిరంజీవి, రామ్ చరణ్ భేటీ

ఏఐ డీప్‌ఫేక్, మార్ఫింగ్ సమస్యపై అమిత్ షాకు వివరించిన వైనం

కఠిన చట్టాలు తెస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ

ఈ అంశంపై లిఖితపూర్వక వినతిపత్రం ఇవ్వాలని చిరంజీవికి సూచన

సమన్వయ బాధ్యతలు కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి అప్పగింత



కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో మెగాస్టార్ చిరంజీవి, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ సోమవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. బీజేపీ మహా పాదయాత్రలో పాల్గొనేందుకు నగరానికి వచ్చిన అమిత్ షాను, బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో వారు కలిశారు. చిత్ర పరిశ్రమ ఎదుర్కొంటున్న ఓ తీవ్రమైన సమస్యను చిరంజీవి ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు తెలుస్తోంది.ప్రస్తుతం సినీ ప్రముఖులను లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఏఐ టెక్నాలజీని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. డీప్‌ఫేక్, మార్ఫింగ్ ద్వారా అసభ్యకరమైన, అభ్యంతరకరమైన కంటెంట్‌ను సృష్టిస్తున్నారని, దీనివల్ల కళాకారులు, ముఖ్యంగా నటీమణులు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారని వివరించారు. టాలీవుడ్‌తో పాటు యావత్ భారత సినీ పరిశ్రమ తరఫున ఈ సమస్యపై కఠినమైన చట్టాలు తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అమిత్ షాను కోరారు.చిరంజీవి చెప్పిన విషయాలను అమిత్ షా సావధానంగా విన్నారు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న ఆయన, దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దృష్టి సారిస్తుందని హామీ ఇచ్చారు. టెక్నాలజీని దుర్వినియోగం చేసి కళాకారులు, మహిళల గౌరవానికి భంగం కలిగించే వారిపై కఠినమైన మార్గదర్శకాలు, శిక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.ఈ విషయంపై పూర్తి వివరాలతో లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలని చిరంజీవికి అమిత్ షా సూచించారు. దీనికి సంబంధించిన సమన్వయ బాధ్యతలను కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి అప్పగించారు. హోంమంత్రి సానుకూలంగా స్పందించడంపై చిరంజీవి సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకునే చర్యలతో చిత్ర పరిశ్రమకు త్వరలోనే ఊరట లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ భేటీలో చిరంజీవి అమిత్ షాను శాలువాతో సత్కరించి, మెమెంటోను బహూకరించారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు - జిల్లా కలెక్టర్ కె. హరిత

వార్త బిపీక న్యూస్



జిల్లాలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు.మంగళవారం దహెగాం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరితో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని, అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను అదే రోజు పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు సమర్పించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈరోజు అర్ధరాత్రి అయినా సబ్ కలెక్టర్, తహసిల్దార్, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉండి భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కారం చేసిన తర్వాతనే వెళతారని తెలిపారు. సమస్యల పరిష్కారంపై రైతులకు వివరించాలని, నక్షా, పట్టా పరిష్కారం కొరకు స్లాట్ బుక్ చేసుకుంటే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.ప్రజలు ప్రజాసేతు యాప్ ను సద్వినియోగం చేసుకోవాలని, యాప్ లో ఇంటి వద్ద నుండే క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి వ్యయ ప్రయాసలకు గురి కావద్దని తెలిపారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే ప్రజాసేవ యాప్ లో క్యూఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన పెద్దల బాణక్క తన భూ సమస్య పరిష్కారానికి మీ సేవలో స్లాట్ బుక్ చేసుకోవడానికి డబ్బులు లేక ఆందోళన చెందుతున్న విషయం తెలుసుకున్న కలెక్టర్ వెంటనే రూ. 1,500లను సదరు మహిళా రైతుకు అందజేశారు. దీంతో ఆ మహిళ ధన్యవాదాలు తెలుపుతూ ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మునవర్ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'..
అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!

మొదటిపేజీ తరువాయి

బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్‌కు అండగా ఉన్నందునే వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అడ్లూరి డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు కోరుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న ఉద్దేశమేంటని నిలదీశారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా వెనుక అదానీ, అంబానీ ఉన్నారని మంత్రి ఆరోపించారు. దేశ సంపదను ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఎన్నికల ప్రక్రియపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని అడ్లూరి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మునుగోడుకు ఇదేం శాపం.. కాంగ్రెస్ ప్రభుత్వ
తీరుపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి!

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గ అభివృద్ధిపై తాను ఎన్నో ఆశలు పెట్టుకున్నానని, అయితే ప్రభుత్వం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రావడం లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. 'ఈ ప్రాంత అభివృద్ధి కోసం మనసు చంపుకొని సీఎం, డిప్యూటీ సీఎం దగ్గరికి నిధుల కోసం వెళ్లాను. మోసం చేసిన వ్యక్తుల దగ్గరికి వెళ్లొద్దని అనుకున్నా. అయినప్పటికీ వెళ్లి అడిగినా నిధులు ఇవ్వలేదు. బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు నియోజకవర్గంలో చేపట్టిన పనులు పక్కన పెట్టారు. కాంట్రాక్టర్ల బాధ చూడలేక నేను మంత్రుల చుట్టూ తిరుగుతున్న. నిధులు రాకపోతే నేనేం చేస్తానో అందరికీ తెలుసు. పార్టీలోకి ఆహ్వానించినప్పుడు నాకు మంత్రి పదవి ఇస్తానని చెప్పారు. చావైనా, బతుకైనా మునుగోడే అనుకున్న.నేను ప్రజల కోసం పనులు చేయలేకపోతే పదవి ఉన్నా దండుగే. వేల కోట్ల రూపాయలతో భారీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు చేపడుతున్న ప్రభుత్వం స్థానికంగా చెరువులు, కుంటలను అభివృద్ధి చేసి నీటి వనరులను పెంపొందించాలని ఎన్నిసార్లు ప్రతిపాదనలు పంపినా నీళ్ల మంత్రి పట్టించుకోవడం లేదు' అని మండిపడ్డారు. ఆయన కోదాడకే మంత్రా? తెలంగాణకు మంత్రి కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన బాధ్యత మంతులకు లేదా? అని నిలదీశారు. తాను మంత్రిని కాకపోయినా ప్రస్తుతం మంత్రుల కంటే సాగు నీటి అంశాలపై ఎక్కువ అవగాహన ఉన్న వ్యక్తినని ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి చెప్పుకొచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ సత్యం, నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ ప్రేమకరణ్‌రెడ్డి, డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

రేస్ కోర్స్ స్థలాన్ని ఐఏఎఫ్‌కే ఇవ్వండి..
రాజ్‌నాథ్‌కు లేఖ రాసిన ఏపీ సింగ్

మొదటిపేజీ తరువాయి

అయితే ఈ వివాదం నేపథ్యంలోనే ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ఫేర్‌వెల్‌ను రద్దు చేసినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఐఏఎఫ్ కానీ, రక్షణ శాఖ నుంచి కానీ అధికారిక ప్రకటన లేదు.ఎయిర్ స్టేషన్ నిర్వహణలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ చాలా ముఖ్యమైందని, ఈ స్థలం ఐఏఎఫ్ వద్దే ఉండాలని, దీని కోసం మరోసారి జాయింట్ సర్వే నిర్వహించాలని ఏపీ సింగ్ తన లేఖలో మంత్రి రాజ్‌నాథ్‌ను కోరారు. రక్షణ శాఖకు వైమానిక దళం తమ అభ్యంతరాలను వ్యక్తం చేసింది. 40 ఎకరాల స్థలం సీలింగ్ ప్రక్రియను రద్దు చేయాలని కోరారు. రేస్ కోర్సు ఎయిర్ స్టేషన్‌కు గత చరిత్ర ఎంతో ఉందని, మూడు సెగ్మెంట్లలో భూమి ఉందని, అయితే అవన్నీ సహజంగా పనిచేయాలని ఏపీ సింగ్ తన లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుతం లోక్ కళ్యాణ్ మార్గ్‌లో ఉన్న అత్యంత ఖరీదైన భూమిలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్నది. డిఫెన్స్ గోల్ఫ్ కోర్సులు, స్పోర్ట్స్ ఫెసిలిటీల్లో ఉన్న ప్లాట్ల గురించి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖకు చెందిన ఎల్ అండ్ డీవో ఇటీవల ఆరా తీసింది. ఎయిర్ ఫోర్స్ గోల్ఫ్ కోర్సును తమకు అప్పగించాలని గృహ, పట్టణ వ్యవహారాల శాఖ కోరింది. దీంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఖాళీ చేయాలని కోరుతూ ఎల్ అండ్ డీవో శాఖ నోటీసులు జారీ చేసింది.ఇటీవల ఢిల్లీ రేస్ క్లబ్, జైపూర్ పోలో గ్రౌండ్‌ను కూడా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

ట్రంప్‌కు అగ్నిపరీక్ష..
అమెరికాలో మొదలైన మధ్యంతర ఎన్నికల పోలింగ్

మొదటిపేజీ తరువాయి

న్యూయార్క్, న్యూజెర్సీ, వర్జీనియా, కనెక్టికట్ సహా పలు తూర్పు తీర రాష్ట్రాల్లో స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6 గంటలకు పోలింగ్ మొదలవగా, ఓటు వేసేందుకు ప్రజలు ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.ఈ ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలతో పాటు, సెనెట్‌లోని 100 స్థానాలకు గాను 35 సీట్లకు పోలింగ్ జరుగుతోంది. వీటితో పాటు 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు కూడా ఎన్నికలు నిర్వహిస్తున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 21 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రికార్డు స్థాయిలో ఇప్పటికే 5.9 కోట్ల మంది ముందస్తు ఓటింగ్ (జుఖతీశ్రీఎ ఎశీఅఅస్త్ర) లేదా మెయిల్-ఇన్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఈ ఎన్నికలపై ప్రజల్లో ఉన్న ఆసక్తిని తెలియజేస్తోంది.అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన నేపథ్యంలో, ఆయన పాలనకు ఈ ఎన్నికలను ఒక రెఫరెండంగా పరిగణిస్తున్నారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న జీవన వ్యయం, సరిహద్దు భద్రత, అక్రమ వలసలు, వాణిజ్య సుంకాల వంటి అంశాలు ఓటర్లను ప్రధానంగా ప్రభావితం చేస్తున్నాయి. అత్యధిక సర్వేల ప్రకారం ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని అంచనాలు వెలువడుతున్నాయి.ప్రస్తుతం కాంగ్రెస్‌లోని రెండు సభల్లో (ప్రతినిధుల సభ, సెనెట్) రిపబ్లికన్లకు స్వల్ప మెజార్టీ ఉంది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు కనీసం ఒక్క సభలోనైనా ఆధిపత్యం సాధిస్తే, అధ్యక్షుడు ట్రంప్ విధానపరమైన నిర్ణయాలకు, చట్టాల ఆమోదానికి అడ్డంకులు సృష్టించే అవకాశం లభిస్తుంది. అయితే, డెమోక్రాట్లు గెలిస్తే, వారు ప్రతిపాదించే ప్రతి బిల్లును తన వీటో అధికారంతో అడ్డుకుంటానని ట్రంప్ ఇప్పటికే స్పష్టం చేశారు. టెక్సాస్, మిచిగాన్, ఐయోవా వంటి కీలక రాష్ట్రాల్లో సెనెట్ స్థానాలకు తీవ్రమైన పోటీ నెలకొంది.పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. భారత కాలమానం ప్రకారం బుధవారం (నవంబరు 4) తెల్లవారుజాము 5.30 గంటల నుంచి ప్రాథమిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, భారీ సంఖ్యలో ఉన్న మెయిల్-ఇన్ బ్యాలెట్ల లెక్కింపు కారణంగా తుది ఫలితాలపై పూర్తి స్పష్టత రావడానికి కొన్ని రోజుల సమయం పట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

420హామీల వైఫల్యంపై గ్రామాల్లో పాదయాత్ర

రైతులకు సాగునీరు అందించాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్





సదాశివపేట, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :

భారత రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలిచ్చి పాలనలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు, అక్రమ అరెస్టులు, వేధింపులు, అవమానాలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ విఫల పాలన, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు త్వరలోనే గ్రామగ్రామాన పాదయాత్ర చేపడతామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బిఆర్ఎస్ కార్యకర్తలకు భరోసా ఇస్తూ పార్టీ కార్యకర్తకు ఏ చిన్న ఆపద వచ్చినా, సమస్య ఎదురైనా ఒక్క మిస్ కాల్ చేయండి.. మీ ముందుకు వచ్చి అండగా నిలబడతానని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ కక్షలకు తావివ్వకుండా ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను ఎవరినీ ఇబ్బందులకు గురిచేయలేదన్నారు. కానీ నేడు కాంగ్రెస్ పాలనలో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిడిసి మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు గడిల సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, కుందెన రాజు, పట్టణ పార్టీ అధ్యక్షులు చిల మల్లన్న, సీనియర్ నాయకులు చింతా సాయినాథ్, ఆత్మకూరు నగేష్, సర్పంచ్ తొంట కిష్టయ్య, మాజీ సర్పంచ్ లు లక్ష్మారెడ్డి, గడ్డమీద సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీలు సత్యనారాయణ యాదవ్, అమరేందర్ రెడ్డి, సుధాకర్ మాధవరెడ్డి, శివకుమార్, అల్లం లలిత అహ్మద్ అశోక్ పండరి, రవికుమార్, కృష్ణారెడ్డి, సంతోష్ గౌడ్, ప్రమోద్, నవీన్ కుమార్, నాగరాజు, గుడ్ల లక్ష్మణ్, యువత అధ్యక్షులు నరేష్ గౌడ్, నగేష్ యాదవ్, బిఆర్ఎస్ వి. ఇంచార్జీ శ్రీహరి, నిజాముద్దీన్, సలావుద్దిన్, పాండు నాయక్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు మాణిక్ రాములు, దశరథ్, నగేష్, సిద్దన్న, సంగమేష్, కరుణాకర్, సంగన్న, శేఖర్, రాములు, నాయకులు యాదగౌడ్, శంభు ప్రసాద్, నబీమియా, జైపాల్, శ్రీనివాస్ రెడ్డి, రఫీ, షబ్బీర్, రమేష్, పాషా, రవి, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినియోగదారుల దినోత్సవం

పటాన్ చెరు, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :

విద్యుత్ శాఖ డివిజన్ రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో బిహెచ్ఇఎల్, ఎమ్ఐ జి సెక్షన్ ఆఫీస్ నందు విద్యుత్ వినియోగదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో గల రామచంద్రపురం అశోక్ నగర్ బీరంగూడ ఉస్మాన్ నగర్, ఓల్డ్ ఎం ఐ జి మరియు న్యూ ఎం ఐ జి కి సంబంధించిన విద్యుత్ వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది, మూడు సెక్షన్లకు సంబంధించి వినియోగదారులు వారి వారి సమస్యలను విన్నవించడం జరిగింది. వారి సమస్యలకు డి ఈ స్థానికుల స్పందన తెలియజేస్తూ వాటిని వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డి ఈ భాస్కర్, ఏ డి ఈ నాగరాజారావు, ఏఈలు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





డంప్ యార్డు నిర్వహణ లోపాలపై... అధికారులపై... ఆగ్రహం..!





ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :

ఎంకేపల్లి డంప్ యార్డ్ నిర్వహణలో నెలకొన్న లోపాలపై ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మున్సిపల్ అధికారులను నిలదీశారు. అధికారులు, ఎంకేపల్లి గ్రామస్థులతో కలిసి డంప్ యార్డ్‌ను సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. గ్రామస్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి, దీపావళి పండుగలోపు సమస్యలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో డంప్ యార్డ్‌లో వేయాల్సిన చెత్త రోడ్లపై పేరుకుపోతోందని, దీంతో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకువచ్చారు. గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై పందులు, పశువుల సంచారం పెరిగిందని, వీధి కుక్కల కారణంగా విద్యార్థులు, మహిళలు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. చెత్తను రోడ్లపై వేయకుండా డంప్ యార్డ్‌లోనే నిల్వ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. అలాగే వర్షపు నీటితో చెత్తలోని వ్యర్థాలు కలిసి సమీపంలోని రెండు చెరువులు కలుషితమ వుతున్నాయని, దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు చెరువులు గంగకత్వ కాలువకు సంబంధించిన టెయిల్ ఎండ్ పాండ్స్ కావడంతో కలుషిత జలాలు చెరువుల్లోకి చేరకుండా తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భూగర్భ జలాలు సైతం కలుషితమవుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే సమయంలో ఎంకేపల్లి చౌరస్తాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణకు అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంకేపల్లి గ్రామ సర్పంచ్, యువత, మాజీ సర్పంచులు రాములు, శేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్ రెడ్డి, కోడూరి రమేష్, మాజీ వైస్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఆత్మకూరు అమరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

చెత్త నిర్వహణ లేక రోడ్లపైకి చెత్త... కుక్కలు, పందుల స్వైరవిహారం..!

కలుషితమవుతున్న చెరువులు, భూగర్భ జలాలు..

మత్స్యకారులకు తీవ్ర నష్టం..!

దీపావళిలోపు సమస్యలు పరిష్కరించాలి

అధికారులు, గ్రామస్తులతో డంప్ యార్డు పరిశీలన

రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన వ్యవసాయ అధికారి..!

అనుమతి కోసం రూ.30 వేలు డిమాండ్

సదాశివపేట, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :



జిల్లాలోని సదాశివపేట మండల వ్యవసాయ అధికారి రమేష్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళితే ఎరువుల దుకాణం అనుమతుల కోసం గత నెల 19వ తేదీన బాధితుడిని రూ.30 వేల లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా అక్టోబర్ 19న బాధితుడు రూ.10 వేలు చెల్లించగా, మిగిలిన రూ.20 వేలను మంగళవారం అందజేస్తున్న సమయంలో మెదక్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ ఆధ్వర్యంలోని అధికారులు దాడి చేసి వ్యవసాయ అధికారి రమేష్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనతో వ్యవసాయ శాఖలో కలకలం రేగింది. ఘటనకు సంబంధించి ఏసీబీ అధికారులు తదుపరి విచారణ చేపట్టారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

సంగారెడ్డి, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :

ఎంఐఎం అధినేత బారిష్టర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు పట్టణంలోని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, గైడ్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను పంపిణీ చేశారు. పట్టణ ప్రెసిడెంట్ మహ్మద్ ఫాజిల్, ఇర్ఫాన్ ఆధ్వర్యంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ మాట్లాడుతూ జేబులో పెన్ పెట్టుకునే వ్యక్తి.. మాటలతో కాదు, తన ఆలోచనలతో ప్రపంచాన్ని గెలవాలని కోరుకుంటాడు" అని బారిష్టర్ అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పే మాటలను గుర్తుచేశారు. విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని, సమాజానికి, తల్లి దండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు.

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్, గైడ్స్, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ మెటీరియల్ విద్యార్థులకు పరీక్షల సమయంలో ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రంలో ఉర్దూ రెండో అధికారిక భాషగా ఉండటం సంతోషకరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం నాయకులు యాకూబ్ అలీ, ఆరిఫ్, ఏజాజ్, షకీల్, జావిద్, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఉర్దూ మీడియం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువ ఆవిష్కర్తలకు గీతం ఇన్నోవేషన్ ఛాలెంజ్

రూ.50 లక్షల వరకు నగదు పురస్కారాలు

డిసెంబర్ 11న గీతం హైదరాబాద్‌లో జాతీయ గ్రాండ్ ఫైనల్

పటాన్‌చెరు, నవంబర్ 3, వార్త దీపిక న్యూస్ :

యువతలోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించి, వాటిని విజయవంతమైన వ్యాపారాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్నోవేషన్ ఛాలెంజ్ 2026ను నిర్వహించనుంది. దేశవ్యాప్తంగా యువ ఆవిష్కర్తలను ఆహ్వానిస్తూ, దాదాపు రూ.50 లక్షల నగదు పురస్కారాలను అందించనుంది.గీతం వెంచర్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో, బోవర్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సౌజన్యంతో ఈ జాతీయ స్థాయి పోటీని నిర్వహిస్తున్నారు. ఆశాజనకమైన ఆలోచనలను ప్రభావవంతమైన, విస్తరించదగిన వ్యాపారాలుగా మార్చేందుకు యువ ఆవిష్కర్తలకు ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందించడం దీని ప్రధాన లక్ష్యం.10 నుంచి 12వ తరగతి విద్యార్థులు,అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, 2025 నుంచి పట్టభద్రులైన యువత ఈ పోటీలో పాల్గొనవచ్చు. జూనియర్,సీనియర్ విభాగాల్లో నిర్వహించే ఈ ఛాలెంజ్‌లో నిజజీవిత సమస్యలకు వినూత్న పరిష్కారాలను అందించే ఆలోచనలను సమర్పించాల్సి ఉంటుంది.వాతావరణ మార్పులు, సుస్థిరత,వ్యవసాయం,ఫుడ్ టెక్నాలజీ,ఆరోగ్య సంరక్షణ, బయోటెక్నాలజీ, డీప్ టెక్, స్మార్ట్ మ్యానుఫ్యాక్చరింగ్, క్రీడలు, ఫిట్‌నెస్, వినియోగదారుల ఉత్పత్తుల రంగాల్లో ఆవిష్కరణలను ప్రోత్సహించనున్నారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు నిపుణుల మార్గదర్శకత్వం, వెంచర్ కోచింగ్,ఇంక్యుబేషన్ అవకాశాలు కల్పించనున్నారు.సీనియర్ విభాగంలో రెండు లక్షల రూపాయల వరకు నగదు బహుమతులతో పాటు గీతం ఐ-టీబీఐలో ఆరు నెలల ఇంక్యుబేషన్ సదుపాయం అందించనున్నారు. జూనియర్ విభాగం ఫైనలిస్టులకు ఏడాది పాటు వ్యక్తిగత వెంచర్ కోచింగ్ కల్పించనున్నారు.ఆన్‌లైన్ స్క్రీనింగ్, వర్చువల్ బూట్ క్యాంప్,మార్గదర్శకత్వం అనంతరం ఈనెల 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ సెమీ ఫైనల్స్ నిర్వహించనున్నారు.డిసెంబర్ 11న గీతం హైదరాబాద్‌లో జాతీయ గ్రాండ్ ఫైనల్ జరగనుంది.పోటీలో పాల్గొనాలనుకునే వారు ఈనెల 7వ తేదీలోగా జీఐసీ పోర్టల్ ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలి.వివరాలకు 90630 65811,83283 34930 నంబర్లను సంప్రదించవచ్చు. స్త్రఅఏస్త్రత్ఖుఎ.వనబకు ఈ-మెయిల్ చేయవచ్చు.

GITAM
DEEMED TO BE UNIVERSITY





TGTEL/26/A5513 వార్త దీపిక

రైతుల నిరాహార దీక్షకు తాండూర్ బీసీ సంఘం సంపూర్ణ మద్దతు

రైతులపై ఎందుకింత చిన్నచూపు

బీసీ నేత రాజకుమార్

తాండూర్, నవంబర్ 3, వార్త దిపీక న్యూస్ :

కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లయ్య ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న రైతుల రిలే నిరాహార దీక్ష 8వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు తాండూర్ బీసీ సంఘం ప్రతినిధులు సంపూర్ణ మద్దతును ప్రకటించారు,ఈ సందర్భంగా బీసీ సంఘం నేత రాజ్ కుమార్ మాట్లాడుతూ చట్టప్రకారం రైతులకు దక్కాల్సిన పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వానికి ఉన్న అభ్యంతరమేంటి రైతుల తమ హక్కుల కోసం రోడ్ ఎక్కి నిరసన దీక్షలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అధికారులు తక్షణమే చర్యలు తీసుకొని రైతులకు చట్టబద్ధంగా రావలసిన పరిహారాన్ని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లయ్య, మహేందర్,రాష్ట్ర బీసీ నాయకులు సయ్యద్, సుకూర్, జిల్లా బీసీ నాయకులు గడ్డం వెంకటేష్, బీసీ సోషల్ మీడియా ఇంచార్జీ బసవరాజ్, బీసీ నాయకులు జోసెఫ్, వెంకట్,ప్రవీణ్,చిన్న,వివేక్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ చైతన్యంలో పాఠశాలలు

తాండూర్, నవంబర్ 3, వార్త దిపీక న్యూస్ :

పర్యావరణ సమతుల్యశీ దెబ్బతింటున్నవేళా వాతావరణ మార్పులు, ప్రభావం పై ప్రజలను చైతన్య పరిచేందుకు తాండూర్ పట్టణం వేదికగా భారీ పర్యావరణ ర్యాలీ జరిగింది. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘం తాండూర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 30 పాఠశాలకు చెందిన 1200 మంది కి పైగా విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీకి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న వాతావరణ మార్పులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా మెలగాలని సూచించారు, విద్యార్థుల్లో చిన్నతనము నుంచే నీటి సంరక్షణ మొక్కల పెంపకం పై అవగాహన పెంపొందించడం ద్వారానే సురక్షితమైన భవిష్యత్తును అందించగలమని స్పష్టం చేశారు. అనంతరం టిఆర్ఎస్ ఎంఎ. ప్రతినిధులు మాట్లాడుతూ పసిఫిక్ మహాసముద్రం ఉపరితల ఉష్ణోగ్రతల వైపరీత్యం వల్ల సంభవించే 'ఎలినో 'ప్రపంచ వ్యాప్తంగా వర్షపాతం ఉష్ణోగ్రతలు వ్యవసాయ రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు.ప్రజలందరూ నీటిని పొదుపుగా వాడుతూ పర్యావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. ర్యాలీలో విద్యార్థులు పర్యావరణ అనుకూల నినాదాలు చేస్తూ తాండూర్ వీధుల గుండా ప్రదర్శన సాగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ ఎం ఏ సలహా మండలి సభ్యులు పాఠశాల యజమాన్యం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్స్ ఆశీస్సులు అభిమానం మరింత బాధ్యతను పెంచాయి..!

డివిజన్ అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్‌కు ఘన సన్మానం

పటాన్ చెరు, నవంబర్ 3, వార్త దిపీక న్యూస్ :

బిరంగూడ డివిజన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా ఈర్ల రాజు ముదిరాజ్ నియమితులైన కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ పరిధిలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు పటేల్‌గూడలోని ఆయన నివాసంలో శాలువాతో ఘనంగా సన్మానించి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమాజానికి ఎంతో విలువైన మార్గదర్శకులని, వారి అనుభవం, ఆశీస్సులు యువతకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. పెద్దలను గౌరవించడం, వారి అవసరాలను గుర్తించి తోడ్పడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. గతంలో సీనియర్ సిటిజన్స్ సాయంత్రం వేళల్లో ఒకచోట చేరి ప్రశాంతంగా గడపడానికి అనువైన స్థలం ఏర్పాటు చేయడంతో పాటు, వారు సౌకర్యవంతంగా కూర్చోవడానికి బల్లలు, బెంచీలు, కుర్చీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజాసేవా ప్రయాణంలో మేమంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని రామచంద్ర గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈర్ల రాజు ముదిరాజ్ సీనియర్ సిటిజన్స్ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారి ఆశీస్సులు తనకు మరింత బాధ్యతను పెంచాయని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీ, వివిధ సంఘాల నాయకులు, సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.



నందికందిని కమ్మేస్తున్న కాలుష్య మేఘాలు..!



కాలుష్య కోరల్లో నందికంది

బ్లూక్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ నుంచి యథావిధిగా పొగ, దుర్వాసన

గ్రామస్తుల ఆందోళనలు..


పట్టింపులుండవ్..?

జనవరి వరకు తాత్కాలిక అనుమతులా..?


పీసీబీ అధికారుల తీరుపై ప్రశ్నలు

సదాశివపేట, నవంబర్ 3, వార్త దిపీక న్యూస్ :

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నందికంది గ్రామ పరిసరాల్లోని బ్లూక్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ, దుర్వాసనతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తున్నారు. కాలుష్య కోరల్లో నందికంది గ్రామం చిక్కుకుంది. జిల్లా స్థాయి అధికారులు ఏలాంటి పట్టింపులు, చర్యలు తీసుకోకుండా తూ.. తూ.. మంత్రంగా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పరిశ్రమ నుంచి వెలువడుతున్న దట్టమైన పొగతో గ్రామ పరిసరాలు కలుషితమవుతున్నాయని, ప్రజలు శ్వాస తీసుకోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ -- ముంబై జాతీయ రహదారి సమీపంలో పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ కారణంగా వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశ్రమ పరిసరాల్లో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తూ, వాటి మరణాలకు గల కారణాలపై విచారణ జరపాలని కోరుతున్నారు. ఇదిలా ఉంటే పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల భద్రతపైనా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్మికులకు తగిన రక్షణ పరికరాలు అందిస్తున్నారా? భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పరిశ్రమ కాలుష్యంపై ఫిర్యాదుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సంప్రదించగా, పరిశ్రమకు జనవరి వరకు తాత్కాలిక వర్కింగ్ పర్మిషన్ ఇచ్చినట్లు తెలిపినట్లు సమాచారం. అయితే కాలుష్యంపై గ్రామస్తుల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ తాత్కాలిక అనుమతులు ఎలా కొనసాగిస్తున్నారంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అధికారులు సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు స్పందించి పరిశ్రమ నుంచి వెలువడుతున్న ఉద్గారాలపై సమగ్ర విచారణ చేపట్టాలని, గాలి నాణ్యత పరీక్షలు నిర్వహించి నివేదికను బహిర్గతం చేయాలని కోరుతున్నారు. ఇదిలాఉంటే నిబంధనల ఉల్లంఘనలు ఉన్నట్లు తేలితే పరిశ్రమ అనుమతులను రద్దు చేసి కార్యకలాపాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. నందికంది ప్రజల ఆరోగ్యం, చిన్నారుల భవిష్యత్తు, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా అధికారులు తక్షణమే స్పందిస్తారా? లేక గ్రామస్తుల ఆందోళనలు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి..?



డోలారోహణ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



జహీరాబాద్, నవంబర్ 3, వార్త దిపీక న్యూస్ :

డోలారోహణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ వై. నరోత్తం పాల్గొని చిన్నారిని ఆశీర్వాదించారు. మంగళవారం న్యాల్కల్ మండల పరిధిలోని మల్గి గ్రామ పార్టీ అధ్యక్షులు సిద్ధారెడ్డి మనవరాలి డోలారోహణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు పాల్గొని చిన్నారిని ఆశీర్వాదించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, సీనియర్ నాయకులు రాజేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జెట్టోండ మారుతి, మాజీ ఎంపీటీసీ శ్రీపద్, బిఆర్ఎస్వీ నాయకులు ఫయాజ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు



ఈత వనం లేదు.. తాటి వనం లేదు..

అయినా సంగారెడ్డికి కల్లు ఎలా వస్తోంది?

-కల్లు కాంపౌండ్లలో మత్తు పదార్థాల వినియోగంపై అనుమానాలు

-ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?

సంగారెడ్డి పట్టణంలో కల్తీ కల్లు దందా సాగుతోందా? సమగ్ర విచారణకు ప్రజల డిమాండ్

సంగారెడ్డి బ్యూరో,

నవంబర్ : 03(వార్త దీపిక)

సంగారెడ్డి పట్టణం చుట్టుపక్కల కనీసం ఒక్క ఈత వనం కనిపించదు.. తాటి వనం కూడా లేదు. అలాంటప్పుడు పట్టణంలోని కల్లు కాంపౌండ్లకు ప్రతిరోజూ పెద్ద మొత్తంలో కల్లు ఎక్కడి నుంచి సరఫరా అవుతోంది? అసలు ఈ కల్లు నాణ్యత ఏమిటి? సరఫరా వెనుక ఉన్నది సహజమైన కల్లేనా? లేక ఇతర మత్తు పదార్థాలు కలిపిన కల్తీ కల్లా? అనే ప్రశ్నలు పట్టణ ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి.కల్లు కాంపౌండ్లలో కొందరు మత్తు కోసం వివిధ పదార్థాలు వినియోగి స్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సహజసిద్ధమైన కల్లుకు బదులుగా మత్తు ప్రభావం పెంచే పదార్థాలు కలుపుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? ఏయే పదార్థాలు వినియోగిస్తున్నారు? అనే అంశాలపై సంబంధిత అధికారులు సమగ్ర విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.కల్లు పేరుతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా కల్లు సేవించే సామాన్య ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా కల్లు నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించాలని కోరుతున్నారు.



ఎక్సైజ్ శాఖ ఏం చేస్తోంది?

సంగారెడ్డి పట్టణంలోని కల్లు కాంపౌండ్లకు కల్లు ఎక్కడి నుంచి వస్తోంది? సరఫరాదారులు ఎవరు? రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? కల్లులో ఎలాంటి రసాయనాలు లేదా మత్తు పదార్థాలు కలుపుతున్నారా? అనే అంశాలపై ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించాలి. అనుమానాస్పద కల్లు కాంపౌండ్లపై నిఘా పెట్టి, నమూనాలను శాస్త్రీయంగా పరీక్షించాలి.

ఈత వనాలు లేవు.. తాటి వనాలు లేవు.. మరి కల్లు ఎక్కడి నుంచి వస్తోంది? కల్లు పేరుతో ఏం విక్రయిస్తున్నారు? ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే బాధ్యత అధికారులదే. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ స్పందించి నిజానిజాలను నిగ్గు తేల్చాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984